కథానిక

జ్ఞాని

"హితశ్రీ"

"ఇవాళ ఆఫీసులేదా ఏమిటి?" అంది స్వర్ణ జడ అల్లటం ముగించి అందం అద్దంలో చూసుకుంటూ.

"ఎందుకు లేదూ?"

"వెళ్ళరేం మరి?"

"ఇంకా పదేగా."

"రోజూ పదింటికేగా వెళ్లేది."

"మేనేజరు వెళ్ళాలిసింది పదకొండింటికి- అన్నట్టు నీకు చెప్పలేదు కాబోలు. నాకు మేనేజర్ గా ప్రమోషనయింది."

సాశ్చర్యంగా చూసింది స్వర్ణ బ్రహ్మానందరావువైపు అతను పడకకుర్చీలో మేను వాల్చి పేపరు చదువుతున్నాడు తీరిగ్గా.

'మరి నిన్నటినుంచీ చెప్పలేదేం?"

"చెప్పేందుకేముంది యిందులో?"

"ఏమీ లేదా?"

బ్రహ్మానందరావు మాట్లాడలేదు. స్వర్ణకి రోషంవచ్చింది. శుభవార్త చెప్పేవిధం ఇదేనా! ఆఫీసునుంచి ఇంటికి రాగానే ప్రథమంగా తనతో చెప్పవలసినవార్త, మాటల సందర్భంలో తర్వాతరోజున తెలియచెయ్యటం తనమీద ఆయనకి ఉన్న నిర్లక్ష్యభావాన్ని వ్యక్తీకరించటంకాదా? రెండేళ్ళనుంచీ ఇంతే. ఈ మాత్రం గ్రహించలేని పసిపిల్లకాదు తను. బ్రహ్మానందరావుకి తన మీద ప్రత్యేకశ్రద్ధగానీ, ప్రేమగానీ ఉన్నట్టు నిదర్శనాలేమీ లేవు.

"అయితే నాకు బహుమానమేమిటి?" అడగకూడదనుకుంటూనే అడిగింది స్వర్ణ.

"నీ ఇష్టం."

మనస్సు కలుక్కుమంది ఆమెకి.

"నా ఇష్టమేమిటి? బహుమతీ ఇచ్చేవాళ్ళ ఇష్టంగాని."

"అయినా ఇందులో సంతోషానికేముంది? నిన్నటిదాకా అకౌంటెంట్ చేశాను. ఇవ్వాళ మేనేజరు చేస్తున్నాను. రేపింకోటి చేయవచ్చు. లేకపోతే అసలేమీ చేయకుండా ఉండోచ్చు. జీవితంలో వెలుగు చీకట్లు వాటి ధర్మాన్ననుసరించి వొస్తూవుంటాయి. వెలుగుని చూసి సంతోషించటం, చీకటిని చూసి దుఃఖించటం తెలియనివాళ్లు చేసేపనులు." భర్త జ్ఞానబోధ విని స్వర్ణ కోపంలోకూడా నవ్వింది.

తామరాకుపై నీటిబిందువులా జీవించటం బ్రహ్మానందరావు ఆశయం. ఏ వస్తువునైనా అతిగా అపేక్షించటం దుఃఖాన్ని ఆహ్వానించటమేననే సిద్ధాంతం అతనికి బాగా నచ్చింది. మనసుని అరికట్టటానికి అన్నివిధాలా ప్రయత్నించాడు. రాగ ద్వేషాలకి అతీతంగా ఉండటానికి నిశ్చయించుకున్నాడు. అతనికి ప్రాణస్నేహితుడంటూ ఎవరూలేరు. అతను ఎవర్నీ ద్వేషించలేదు. ఆఫీసర్ చీవాట్లు పెడుతుంటే ఎదురుచెప్పేవాడు కాడు. "ఉద్రేకాన్ని జయించలేవా?" అన్నట్టు మందస్మిత వదనంతో ఆయనవైపు జాలిగా చూసేవాడు. ఈ ప్రవర్తన అతని అభివృద్ధికి చాలా దోహదమిచ్చింది. బ్రహ్మానందరావు చాలా వినయ విధేయతలు కలవాడని, తెలివి తేటలు కలవాడని ప్రతి అధికారీ సిఫారసు చేశాడు. అయితే తోటి ఉద్యోగుల్లో బ్రహ్మానందరావుకి పలుకుబడిలేదు. మానాభిమానాలులేని వాడనీ, ఉద్యోగం నిలబెట్టుకోటానికి ఆఫీసర్ అడుగులకి మడుగు లొత్తుతాడనీ వాళ్లు తీర్మానించుకున్నారు. అతని ప్రవర్తన అర్థంచేసుకోటం ఇష్టంలేకపోతే అతన్ని గర్విష్ఠి అనీ, పొగరుబోతు అనీ, మానాభిమానాలు లేనివాడనీ అనవచ్చు.

స్వర్ణమీద తనకి అనురాగం అధికమౌతోందని మొదట్లోనే గ్రహించి జాగ్రత్త పడ్డాడు బ్రహ్మానందరావు. తన ఆశయం మనసులో ఉంచుకుని, ఏ వస్తువుమీదా ఎక్కువగా మమకారం

ఉండటం మంచిది కాదని స్వర్ణకి చూచాయగా చెబుతూ వొచ్చాడు. స్వర్ణతో అతను, "నీవే నా సర్వస్వం,నువ్వు లేకపోతే నేను జీవించలేను" లాంటి మాటలు ఎప్పుడూ మాట్లాడలేదు. ఆమెతో మాట్లాడుతున్నంతసేపూ అతనికి తామరాకుమీద నీటి బిందువు జారిపోతున్నట్టుగా చిత్రం కనిపించేది.

"ఇదం కావ్య మిదం కావ్యం నదీతీరే సముచ్చయః" అనే వాక్యం అత నెప్పుడూ స్వర్ణతో మాట్లాడుతున్నంతసేపూ మర్చిపోయేవాడు కాడు.

ఓరోజు బ్రహ్మానందరావు ఆఫీసునుంచి ఇంటికి రాగానే అతన్ని చిరునవ్వుతో పలకరించి అంది స్వర్ణ:

"ఇవాళ మీకో శుభవార్త."

"ఏమిటి?"

"చెప్పుకోండి మరి, చూద్దాం." తమాషాగా కళ్ళు తిప్పుతూ అంది.

"నా కలాంటి విద్యలు రావు."

"విశారద మొదటి తరగతిలో ప్యాసయాను. ప్రేమీమండలి వాళ్లు చెప్పారు."

"అలాగా?" అని క్లుప్తంగా అనేసి బ్రహ్మానందరావు పడక కుర్చీలో పడుకుని పేపరు అందుకున్నాడు. తను ఈ వార్త చెప్పగానే భర్త ఏం చేస్తాడో, ఎలా తన సంతోషం ప్రకటిస్తాడో చిత్ర, విచిత్రంగా ఊహించుకున్న స్వర్ణకి చెంపపెట్టు పెట్టినట్టయింది. ఉక్రోషంతో అంది:

"నేను ప్యాసయితే మీకు సంతోషంగా లేదా?"

మహా యోగి అజ్ఞాని వైపులా, బ్రహ్మానందరావు స్వర్ణవైపు చూశాడు.

"కష్టపడి చదివావు, పాసయావు. నీకర్తవ్యం నువ్వు నెరవేర్చినప్పుడు ఫలితానికి సంతోషించటంగాని, దుఃఖించటంగాని అనవసరం, అవివేకం."

"ఏమిటో మీ మెట్ట వేదాంతం మీరూ, నాఉత్సాహం కాస్తా చంపేశారు. ఇంకా ఎంతో సంతోషించి మెచ్చుకుంటారని పొద్దుటి నుంచీ ఎంతో ఆశ పెట్టుకున్నాను."

బ్రహ్మానందరావు ఆమెవైపు జాలిగా చూసి అన్నాడు:

"స్వర్ణా, ఈ ప్రపంచంలో పుట్టి బతికేది ఒకరి మెప్పు సంపాదించుకోటంకోసం కాదు. ప్రపంచంలో పుట్టింది మొదలు చచ్చిపోయే వరకూ ఎన్నో పనులు చేస్తాం. చేయటం మన కర్తవ్యం. ఫలితంతో మనకి సంబంధం లేదు. అలాకాక ఫలితంకోసం మనం ఆశిస్తే జీవితంలో దుఃఖాలు తప్పవు. భూమిమీద పుట్టాం. ఎవ రెవరం ఎక్కడినుంచి వొచ్చామో ఎవరికీ తెలియదు. ఎలా వొచ్చామో అలాగే నిష్క్రమిస్తాం. అలాగే మనం జీవించటం ముఖ్యం. లేకపోతే జీవితం దుఃఖభాజనమైపోతుంది. మమకారాలకి అంతచను విప్వటం మంచిది కాదు." పాలిపోయిన ముఖంతో స్వర్ణ శూన్యంలోకి చూసింది. తర్వాత తడిలేని కళ్లతో బ్రహ్మానందరావువైపు చూసి కళ్లు తడిచేసుకుంది.

రోజు లలాగే గడిచిపోతున్నాయి. బ్రహ్మానందరావులో మార్పేమీ లేదు. స్వర్ణ హృదయ వేదనతో రోజురోజుకి క్షీణించిపోతోంది. ఆమెకి జీవించటం ఎందుకో అర్థం కావటం లేదు. ఓరోజు మధ్యాహ్నం భోంచేసి తిరిగ్గా పడుకుని కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న స్వర్ణవైపు పరాకుగా చూశాడు బ్రహ్మానందరావు. వెంటనే ఉలిక్కిపడ్డాడు. స్వర్ణ జ్వరపడ్డ దానిలా చిక్కి సగమైంది. ఆమెకళ్లు గుంటలుపడి ఉన్నాయి.

"అలా ఉన్నావేం స్వర్ణా?"

"ఎలా ఉన్నాను?" పుస్తకంనుంచి దృష్టి మరలించి భర్తవైపు కాంతిహీనమైన కళ్లను విప్పి అంది స్వర్ణ.

"ఎలా ఉండట మేమిటి? బొత్తిగా చిక్కిపోయావు."

స్వర్ణ ప్రత్యుత్తర మివ్వలేదు.

"అన్నం తిన్నావా?"

"ఊహుఁ."

"ఏం?" ఆశ్చర్యంతో అడిగాడు బ్రహ్మానందరావు.

"తినాలని లేదు."

"వొంట్లో బావుండ లేదా?"

"ఊఁ."

"ఎప్పటినుంచి?"

"వారం రోజు లవుతుందేమో." నిర్వికారంగా అంది స్వర్ణ.

"ఏమిటీ? వారం రోజుల్నుంచీ అన్నం మానేశా వేమిటి కొంపతీసి?"

"ఏం తినకపోతే?"

"మతిపోయిందా ఏమిటి? నాతో చెప్ప లేదేం? అంత అశ్రద్ధ ఐతే ఎలా?"

"ఇంతలో వొచ్చే నష్టమేముంది?"

"అఘోరించినట్టే ఉంది. డాక్టర్ని పిలుచుకు వొస్తా నుండు-"

"డాక్ట రెందుకు?"

"ఎందుకేమిటి, లేకపోతే ఎలా తగ్గుతుంది?"

"తగ్గకపోతే ఏం ?"

స్వర్ణ మొండి జవాబులు వింటుంటే బ్రహ్మానందరావుకి బ్రహ్మాండమైన ఆశ్చర్యం వేసింది.

"మొండిగా మాట్లాడటం ఎప్పటి నుంచి నేర్చుకున్నావు ?"

"మొండితనం కాదు. ఈ ప్రపంచంలోకి ఎలా వొచ్చామో అలాగే నిష్క్రమిస్తాము. నేను చస్తే మాత్రం ఎవరికి నష్టం ?"

బ్రహ్మానందరావుకి మనసు కొంచెం చలించింది.

"అవేం మాటలు ?"

"అబద్ధ మేముంది నేను చెప్పిందాంట్లో ?"

నిజమే,స్వర్ణ చెప్పిందాంట్లో అబద్ధమేముంది? "ఇదం కాష్ట మిదం కాష్టం..." తనకు తెలియకుండానే స్వర్ణమీద తనకి అనురాగం ఎక్కువౌతోంది. తన ఆశయం నుంచి దూరమౌతున్నాడు. తామరాకుమీద నీటిబిందువులు పడి జారిపోతున్నట్టు చిత్రం కనుపించింది అతడి మనోఫలకం మీద. మనసుని బిగబట్టుకోవాలి.

"డాక్టర్ని పిలుచుకు వొస్తాను" అనేసి బ్రహ్మానందరావు వెళ్ళిపోయాడు. స్వర్ణ అతను వెళ్ళినవైపు రెప్ప వాల్చకుండా చూసింది. తర్వాత నిస్పృహగా నిట్టూర్చింది. తనమీద ఏమాత్రం ప్రేమ ఉన్నా బ్రహ్మానందరావు అలా ప్రవర్తించగలడా? తన భర్త ప్రదర్శించింది కేవలం మానవత్వం. హృదయం ఉన్నవాడు ఎవరయినా ఆ విధంగానే ప్రవర్తించేవాడు-ప్రేమ లేకపోయినా కూడా. వారం రోజుల నుంచి తిండి లేక కృశించిన తనపట్ల అతని వైఖరి చూసి స్వర్ణకి దుఃఖం వెల్లువలైంది.

డాక్టరు మందుతో స్వర్ణకి క్రమేణా ఆరోగ్యం కలిగింది. అప్పుడప్పుడు బ్రహ్మానందరావు స్వర్ణ నుదురుపై చేయివేసి "తగ్గుతుందిలే" అని మాత్రం అనేవాడు. ఆ సమయాల్లో కిటికీలోంచి దూరంలో చెరువులోని తామరమొక్కపై దృష్టి నిలపటం మాత్రం అత నెప్పుడూ మర్చిపోలేదు. అనురాగం ఒలికే ఒక్కమాట కోసం స్వర్ణ తహతహ లాడింది కాని ఆమె కది లభించలేదు.

ఓరోజు బ్రహ్మానందరావు ఆఫీసుకి వెళ్ళి మామూలు ప్రకారంగా పేపరు చేత పట్టుకున్నాడు.

"మాఅన్నయ్య ఉత్తరం రాశాడు" అంది స్వర్ణ.

"ఓహో."

"ఏం రాశాడో తెలుసుకోవాలని లేదా ?" అందామె చిరాగ్గా, అతని వైఖరి చూసి.

"ఏం రాశాడు?"

"రే పిక్కడికి వొస్తున్నాట్ట."

"అలాగా ?" అని ఊరుకున్నాడు బ్రహ్మానందరావు.

"ఎందుకు ?"

"నన్ను తీసుకువెళ్లటానికట"

"ఆహా" అని మాత్రం అని పేపరు చదవటం ప్రారంభించాడు బ్రహ్మానందరావు. అతని నిర్లక్ష్యం చూసి స్వర్ణ అభిమానం దెబ్బ తిన్నది.

"ఎప్పుడూ ఆ పేపరేమిటి, చెప్పే దేమీ వినిపించుకోకుండా?" అని అతని చేతిలో పేపరు విసిరి అవతల పారేసింది స్వర్ణ.

"ఏమిటి స్వర్ణా, రానురాను మరీ చిన్న పిల్లవయి పోతున్నావు" అన్నాడు బ్రహ్మానందరావు ఆమెవైపు వింతగా చూస్తూ.

"ప్రయాణం సంగతి ఆలోచించండి, పేపరు ఎక్కడికీ పోదు."

"ఆలోచించే దేముంది? నువ్వు వెళ్లదలుచుకుంటే వెళ్లు."

"మరి మీకు ఇక్కడ కష్టంగా ఉండదూ?"

"కష్టమెందుకూ? ఇంట్లో తినేది హోటల్లో తింటాను."

"అంతేనా - ఒంటరిగా మీకేం తోస్తుంది? పోనీ, మీరు కూడా రాకూడదూ ?"

"ఒంటరిగా ఉండటం నాకు అలవాటేలే. అదే నాకు ఇష్టం." చివరి వాక్యం స్వర్ణ మనస్సుకి ఎంత బాధ కలిగిస్తుందో బ్రహ్మానందరావుకి వెంటనే తట్టలేదు. తర్వాత నాలిక కొరుక్కున్నాడు; కాని పరిస్థితి చక్కబరచటానికి ప్రయత్నించ లేదు. మర్నాడు స్వర్ణ పుట్టింటికి వెళ్ళిపోయింది, వ్యథిత హృదయంతో.

పుట్టింటికి వెళ్ళిన తర్వాత స్వర్ణ భర్తకి ఒకే ఒక ఉత్తరం రాసింది. ఆ ఉత్తరంలోని ప్రతి అక్షరం ఆమె ప్రేమని ప్రస్ఫుటంచేసింది. బ్రహ్మానందరావు ఆ ఉత్తరం అందుకుని చాలా కదిలిపోయాడు. ఆమెకి తిరిగి వ్రాసిన ఉత్తరం మళ్ళీ చదువుకుని చింపేశాడు. తామరాకుపై నీటి బిందువుకీ, ఆ ఉత్తరానికీ ఏమీ సంబంధం లేదు.

స్వర్ణకి పుట్టింటికి వెళ్ళింతర్వాత భర్త దగ్గర నుంచి ఒకే ఒక ఉత్తరం-ఆమె ఉత్తరానికి సమాధానం—వొచ్చింది.

"స్వర్ణకి—

నీ ఉత్తరం అందింది. నేను హాయిగానే ఉన్నాను. మనసు ఒకే విషయంమీద కేంద్రీకరించి అనవసరంగా బాధపడ వద్దు. ఇంతే సంగతులు.

బ్రహ్మానందరావు."

అతను స్వర్ణకి మళ్ళీ ఉత్తరంవ్రాయలేదు.ఆమె ఆత్మాభిమానం పూర్తిగా దెబ్బతిన్నది. బ్రహ్మానందం ఆశయం ఏ వస్తువునీ అతిగా అపేక్షించకుండా ఉండటం. కాని స్వర్ణకి ఇప్పు డసలు అపేక్షించదగిన వస్తువేదీ కనబడలేదు. అపేక్షించిన వస్తువు తిరస్కరించింది. అయినప్పుడు జీవించటంలో గల అవసరం ఆమెకి బోధపడలేదు. ఫలితం ఆమెకి తన ఆరోగ్యంమీద శ్రద్ధ తగ్గిపోయింది. రోజురోజుకీ ఆమె క్షీణించిపోసాగింది ఆమె అన్నయ్య గోపాలరావు చాలామంది డాక్టర్లకి చూపించాడు. మనోవ్యాధి అన్నారు డాక్టర్లంతా.

గోపాలరావు బండిదిగి ఇంట్లోకి పోయేసరికి బ్రహ్మానందరావు శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. స్వర్ణమీది ప్రేమకీ, తన ఆశయానికీ జరుగుతున్న యుద్ధంలో జయాపజయాలు స్థిరంగా ఎవర్నీ వరించటంలేదు. గోపాలరావుని చూసి అతను ఆశ్చర్యంతో అన్నాడు-

"ఉత్తరం రాయకుండానే వొచ్చావేం!"

"నే ఒక్కణ్ణే వొచ్చాను. నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"ఏమిటి?" బ్రహ్మానందరావు కిదంతా అగమ్యగోచరంగా ఉంది.

"బావా, చదువుకున్న వాడివి; నీ విలాప్రవర్తించటంలో అర్థంలేదు."

"ఏమిటి నీ అభిప్రాయం?"

"తప్పెవరిదయినా సర్దుకుపోవటం విద్యాధికుల లక్షణం."

"తప్పేమిటోయ్?"

"నాకు తెలియదనా నీ ఉద్దేశం? నే నంతా గమనిస్తూనే ఉన్నాను. స్వర్ణ మా ఇంటికి వొచ్చిన తర్వాత ఒక్కసారిమాత్రం నువ్వు ఉత్తరం రాశావు దానికి.ఆ ఉత్తరం చూసి స్వర్ణ కన్నీళ్లు నింపుకోవటం నేను చూశాను. కాని ఎందుకో అనుకున్నాను. పోట్లాట వొస్తే మాత్రం అంత తెగేదాకా లాగటం ఎవరికీ ఘనత కాదు."

"నువ్వపోహ పడుతున్నావోయ్, గోపాలరావ్. స్వర్ణని నే నెప్పుడూ పల్లెత్తు మాటకూడా అనలేదు. ఆమెకూడా నాతో ఎప్పుడూ పోట్లాడలేదు."

"నిజమా?"

"శుద్ధ నిజం."

"మరయితే డాక్టర్లు దానికి మనోవ్యాధి అంటా రేమిటి?"

"మనోవ్యాధా?"

"అవును. బావా. స్వర్ణని చూస్తే కడుపు తరుక్కుపోతుంది. మనిషి సగమైనా మిగల్లేదు. ఎలా నయమవుతుందో నాకేమీ అర్థంకావటం లేదు."

"ఏమిటీ. స్వర్ణకి జబ్బా?" కడుపులో ఏదో కెలికి నట్టయింది బ్రహ్మానంద రావుకి. "నాకు ఉత్తరమైనా రాయలేదే!"

"అంచేతే ఏదో పోట్లాట జరిగి ఉంటుందని నే నభిప్రాయపడ్డాను. కాని స్వర్ణ నడిగితే ఏమీ లేదంది."

బ్రహ్మానందరావుకి కాలు నిలవలేదు. అతని మనస్సు స్వర్ణ దగ్గిరికి పరిగెత్తింది. శరీరాన్ని కూడా అక్కడికి చేరవేసేదాకా అతనికి పిచ్చెత్తి నట్టయింది.

చిక్కి శల్యమై మంచంమీద పడుకునివున్న స్వర్ణనిచూసి బ్రహ్మానందరావు ఓ పిచ్చికేక వేశాడు. స్వర్ణ ఉలిక్కిపడి చూసింది. బ్రహ్మానంద రావు ఆమె మంచంమీద కూర్చుని ఆమె శిరోజాలు సర్దుతూ అన్నాడు:

"ఉత్తరం ఎందుకు వ్రాయలేదు, స్వర్ణా?"

స్వర్ణ అతని మాటకి జవాబుచెప్పలేదు. కాసే పాగి అంది:

"మిమ్మల్ని ఆఖరిసారిచూడటం ఇదేనేమో. ఇహ నేను కోరికలేంలేకుండా హాయిగా చచ్చి పోగలను."

"ఛీ,అవేంమాటలు స్వర్ణా?" అన్నాడుబ్రహ్మా నందరావు గద్గదికంగా.

"ఎవరెవరివాళ్లు ఈప్రపంచంలో? నేను చచ్చి పోయినా మీ కంత దుఃఖం ఉండదని నాకు తెలుసు."

తామరాకుపై నీటిబిందువు జారి ఆకుని తడి చేయకుండా మట్టిలో లీనమై పోయినట్లు బ్రహ్మా నందరావుకి మనోవీధిలో చిత్రం కనిపించింది.

"స్వర్ణా, నీ వెంటే నే కూడా-" ఆ తర్వాత బ్రహ్మానందరావుకి మాట పెగల్లేదు.

విస్ఫారిత నేత్రాలతో స్వర్ణ అతనివైపు చూసింది.

"అవును, స్వర్ణా! నా సర్వస్వం నన్ను ఒది లేస్తే నేను ఈ ప్రపంచాన్నే ఒదిలేస్తాను."

స్వర్ణ నేత్రాలు అశ్రువులతో నిండాయి. ఆమె బ్రహ్మానందరావు చేతిని తన చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా అంది-

"నేను చావను. ఎందుకు చస్తాను! చావ టంలో అర్థంలేదు."

బ్రహ్మానందరావు మౌనంగా ఆమెతల నిమిరాడు.

ప్రభుత్వ తీర్మానాలు

"ధర హెచ్చుట తగ్గు కొరకే" కవునా?

రావెళ్ల హనుమంతరావు

ఆహార ధాన్యాల ధరలు నూటికి పదివంతులు తగ్గించాలని అక్టోబరు రెండో వారములో ఢిల్లీలో జరిగిన రాష్ట్ర-సంస్థానాల సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించటం జరిగింది.

"ప్రస్తుతం దేశంలోగల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అత్యవసర చర్యలు తీసుకోవలసిన ఆగత్యం వున్నందున జీవితావసర వస్తువుల ధరలు తగ్గించటం ఆవశ్యకమని యీ సమావేశం తీర్మానించింది. అందుకోసం ఆహార ధాన్యాల ధరలు, వీటితోపాటు వ్యవసాయదారులకు కావలసిన ప్రధాన వస్తువుల ధరలూ ఒకేసారి తగ్గించాలని వీరు నిర్ణయించారు. ఈధరల తగ్గింపుతో పాటు పల్లె ప్రాంతాలకు కావలసిన వస్తువుల సప్లయి అధికం చేయడానికిగూడా తగు కార్య విధానాన్ని రాష్ట్ర-సంస్థానాల ప్రతినిధులతో సంప్రతించి కేంద్ర ప్రభుత్వం త్వరగా తయారు చేయాలనిగూడా వీరు సూచించారు."

ఇది సంతోషకరమైన వార్త. అన్ని తరగతుల జనం ఆనందించదగిన విషయం. ఎరువులు, విత్తనాల ధరలు-వ్యవసాయపు పనిముట్ల ధరలు-పశువులకు కావలసిన దాణా దినుసుల ధరలు-మానవులకు నిత్యజీవితావసర వస్తువులైన పంచదార, బెల్లం, ఉప్పు, పప్పు, చింతపండు, కారం, నూనె వగైరాల ధర లన్నీ చుక్కలు చూస్తూన్న యీ సమయంలో ఇలాంటి నిర్ణయానికి రావటం కంటే ఆనందించతగిన విషయం మరొకటి వుండ బోదనటంలో ఆశ్చర్యంగాని, అతిశయోక్తిగాని అణుమాత్రంగూడా లేదు.